

గవర్నర్‌కు సాదర స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

గోపాలపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం రాత్రి 8.45 గంటలకు విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, డీపీసీ-2 మేరీ ప్రశాంతి, గోపాలపట్నం, గాజువాక తహసీల్దార్లు, పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకే ధ్యేయం

- సర్వే కోసం సర్వం సన్నద్ధం

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్



ఫటా..ఫట్

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంక్ లక్ష్యంగా పెట్టుకున్నామని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.నరేష్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ -2025 పోటీలో భాగంగా కేంద్ర బృందాలు ప్రస్తుతం నగరంలో సర్వే చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ఎలా సన్నద్ధమయ్యారనే దానిపై 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: స్వచ్ఛ సర్వేక్షణ్ -2025 ప్రత్యేకత ఏమిటి?

జవాబు: స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ ప్రతి ఏటా జరిగేదే అయినప్పటికీ ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం టూల్‌కిట్ పేరుతో పాఠశాలల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించింది. దాని ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ పరిశుభ్రత ఉండేలా ప్రతి తరగతి గదిలోనూ డస్ట్‌బిన్ల ఏర్పాటు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటుచేశాం.

ప్రశ్న: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల భాగస్వామ్యం పెంచడానికి ఏం చేశారు?

జవాబు: స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ కీలకం. ఆన్‌లైన్‌లో ఫీడ్‌బ్యాక్‌ను ఇస్తే గరిష్ఠంగా 20 శాతం మార్కులే వస్తాయి. అదే కేంద్ర ప్రభుత్వ బృందాలు సర్వేకోసం వచ్చినపుడు నివాసాలు, వాణిజ్య సముదాయాలకు వెళ్లి పారిశుధ్య నిర్వహణలో జీవీఎంసీ కృషి ఎలా ఉందనేదానిపై ప్రజలను అడిగి వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపిస్తారు. దీనికి 80 శాతం మార్కులుంటా యి. అందువల్లే ప్రజల్లో స్వచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన పెంచేందుకు అనేకరకాలుగా ప్రచారం చేశాం.

ప్రశ్న: చెత్త పునర్వినియోగంలో పురోగతి సాధించారా?

జవాబు: నగరంలో ఉత్పత్తయ్యే చెత్త పునర్వినియోగం అంశం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కీలకం. కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త (లెగసీవేస్ట్)ను అనేక రూపాల్లో పునర్వినియోగానికి ముడిసరకుగా మార్చాం. దీనివల్ల సుమారు 22 ఎకరాల భూమి అందుబాటులోకి రావడంతో మొక్కలు నాటాం. భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్‌యూనిట్ మూతపడగా, దానిని ఇటీవల పునఃప్రారంభించాం. ఇది నగరానికి మంచి ర్యాంకు దక్కడానికి దోహదపడుతుంది.

ప్రశ్న: పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: విశాఖ అంటేనే పర్యాటకం ... మిగతా 6వ పేజీలో

నేడే ఐపీఎల్ సమరం

ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రాత్రి 7.30 గంటలకు ప్రారంభం



సర్వాంగ సుందరంగా ముస్తాబైన స్టేడియం

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య సోమవారం సాయంత్రం జరగనున్న ఐపీఎల్ టీ-20 మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. నిర్వాహకులు ఇప్పటికే స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సీజన్‌లో రెండు జట్లకు ఇదే తొలి మ్యాచ్. ఇక్కడి స్టేడియాన్ని రెండు మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయం సాధించాలనే సంకల్పంతో సిద్ధమవుతోంది. క్రీడాభిమానులకు మరికొద్ది గంటల్లో ఐపీఎల్ మ్యాచ్ మజాను అందించేందుకు ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధంగా ఉంది.



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల కెప్టెన్లు రిషబ్ పంత్, అక్షర్ పటేల్

ప్రత్యేక ఆకర్షణగా రిషబ్ పంత్, అక్షర్‌పటేల్

సోమవారం జరగనున్న మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రిషబ్ పంత్, ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో అక్షర పటేల్, కేఎల్ రాహుల్, కులదీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, డూప్లెసిస్ మినహా మిగిలినవారిలో స్టార్ ఆటగాళ్లు తక్కువ. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌లో రిషబ్ పంత్, మిచెల్ మార్ష్, డేవిడ్ మిల్లర్ వంటి సీనియర్ క్రికెటర్లున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద వైఫైతో కూడా స్కానర్ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు టికెట్‌పై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేసి లోపలికి ప్రవేశించాలి. తోపులాటకు తావివ్వకుండా మ్యాచ్ ప్రారంభానికి రెండు గంటల ముందుగానే ప్రేక్షకులను అనుమతించనున్నారు.

భారీ బందోబస్తు : క్రికెట్ మ్యాచ్ భద్రతకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీని నియమించుకుంది. వీరు స్టేడియంలోపల సేవలందిస్తారు. కాగా ఇరుజట్ల ఆటగాళ్లు ఆదివారం ముమ్మర సాధన చేశారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఎల్ఎస్‌జీ, డీసీ ఆటగాళ్లు స్టేడియానికి చేరుకుని బ్యాటింగ్, బౌలింగ్ నెట్ ప్రాక్టీసు చేశారు.

స్టేడియంలోకి ప్రవేశం ఇలా..

మధురవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ మ్యాచ్‌కు ప్రేక్షకులు, అధికారులు, క్రికెటర్లు ... మిగతా 6వ పేజీలో

పదవుల కోలాహలం

మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు కూటమి కార్పొరేటర్ల పోటీ

- నేతలను ప్రసన్నం చేసుకుంటున్న ఆశావహులు
- సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్
- సీనియారిటీని గుర్తించి, అవకాశం ఇవ్వాలంటున్న మరికొందరు
- మేయర్‌పై అవిశ్వాసం పెట్టిన తరువాత చూద్దామంటూ నేతల దాటవేత



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసం కోరుతూ కూటమి కార్పొరేటర్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు నోటీసు ఇవ్వడంతో కూటమిలో పదవుల కోలాహలం ప్రారంభమయింది. మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్లు ఇద్దరినీ పదవీచ్యుతులను చేయడం ఖాయం కావడంతో వాటిని దక్కించుకునేందుకు ఆశావహులు రంగంలోకి దిగారు. అస్మదీయులైన నేతల వద్దకు వెళ్లి అవకాశం ఇప్పించాలని ఒత్తిడిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి హామీ ఇవ్వాలో తెలియక తలలు పట్టుకుంటున్న నేతలంతా మేయర్‌పై అవిశ్వాసం పూర్తయిన తర్వాత ఈ సంగతి చూద్దామంటూ దాటవేస్తున్నారు.

మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన తర్వాత కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలకు కొత్త తలనొప్పి మొదలయింది. నోటీసు ఇచ్చి ఒక్కరోజు కూడా గడవకుండానే మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం టీడీపీ, జనసేనకు చెందిన కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. జీవీఎంసీకి ఎన్నికలు జరిగి నాలుగేళ్లయింది. మరో ఏడాది వ్యవధి ఉంది. కౌన్సిల్‌లో కూటమి బలం పెరగడంతో కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు కూటమి నేతలు శనివారం అవిశ్వాసంపై నోటీసు ఇచ్చారు. దీని ప్రకారం మరో 15 రోజుల్లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసే అవకాశం ఉంది. అవిశ్వాసతీర్మానం నెగ్గిన అనంతరం మేయర్ పదవి నుంచి గొలగాని హరివెంకటకుమారి వైదొలగడంతోపాటు డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్ వైదొలగాల్సి ఉంటుంది. ఆ కుర్చీలను దక్కించుకునేందుకు కూటమికి చెందిన పలువురు కార్పొరేటర్లు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మేయర్‌గా టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్‌ను ఎన్నుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అయితే బీసీ మహిళకే మేయర్ పీఠం అప్పగిస్తే విమర్శకులకు తావుండదని మరికొందరు నేతలు అభిప్రాయపడుతున్నట్టు సమాచారం. ఏడాది మాత్రమే వ్యవధి ఉన్నందున సమర్థంగా కౌన్సిల్‌ను నడపడంతో పాటు నగరాభివృద్ధి దిశగా అధికారులకు దిశానిర్దేశం చేయగల విద్యావంతులను మేయర్‌గా ఎన్నుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మరికొందరు విశ్లేషిస్తున్నట్టు సమాచారం. ఇలాంటి అభిప్రాయాలు నేతల నుంచి వస్తుండడంతో బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్లు మేయర్‌గా అవకాశం వస్తుందేమోననే ఆశల్లో ... మిగతా 6వ పేజీలో

కార్మికుల జోలికొస్తే ఉద్యమం

- 'ఉక్కు' కాంట్రాక్టు కార్మికుల తొలగింపు సరికాదు
- ఉపాధి రక్షణ పేరుతో అఖిలపక్ష రాజకీయ, కార్మిక నేతల పాదయాత్ర



కొత్తగాజువాక జంక్షన్ వద్ద అఖిలపక్ష కార్మిక నాయకులు, రాజకీయ నాయకుల పాదయాత్ర

గాజువాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించినా ప్లాంటును దిగ్బంధిస్తామని అఖిలపక్ష కార్మిక, రాజకీయ నేతలు హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దంటూ కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వరకు 'ఉపాధి రక్షణ' పేరుతో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. కొత్తగాజువాక జంక్షన్ వద్ద ప్రారంభమైన యాత్రనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఏళ్ల పాటు ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తీసివేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. కార్మికుల జోలికొస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ప్లాంటును పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరించమని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన 248 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. పాదయాత్రలో అఖిలపక్ష నాయకులు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్.రావు, డీవీ.రమణారెడ్డి, జి.శ్రీనివాస్, మంత్రి రవి, లోకనాథం, రమణ, వంశీకృష్ణ, వేణుగోపాల్, రాజకీయ నేతలు తిప్పల దేవన్‌రెడ్డి, లక్కరాజు రామారావు, సోంబాబు పాల్గొన్నారు. ఈ యాత్ర కొత్తగాజువాక నుంచి పాతగాజువాక, చినగంట్యాడ, శ్రీనగర్, వడ్లపూడి మీదుగా కూర్మన్నపాలెం దీక్షా శిబిరం వరకు సాగింది.

3 నుంచి టెన్త్ మూల్యాంకనం

- జిల్లాకు రెండు లక్షల జవాబు పత్రాలు
- సోషల్ స్టడీస్, హిందీ సబ్జెక్టులకు టీచర్ల కొరత

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో కీలకమైన జవాబుపత్రాల మూల్యాంకనం వచ్చేనెల మూడోతేదీ నుంచి జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ సన్నాహాలు చేపట్టింది.

మూల్యాంకనంలో విధులు నిర్వహించే టీచర్లకు సంబంధిత ఎంఈవోల ద్వారా ఆర్డర్లను అందజేశారు. గత ఏడాది జిల్లాకు 1.8 లక్షల జవాబుపత్రాలు వచ్చాయి. ఈ ఏడాది రెండు లక్షల వరకు జవాబుపత్రాలు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఒక్కో సబ్జెక్టుకు సగటున 120మంది టీచర్లు అవసరం. చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా స్కూలు అసిస్టెంట్లు, హెచ్ఎంల సేవలు వినియోగిస్తారు. స్పెషల్ అసిస్టెంట్లుగా సెకండరీగ్రేడ్ టీచర్లకు విధులు అప్పగించనున్నారు. కాగా ఏడు సబ్జెక్టులలో ఎక్కువగా గణితం జవాబుపత్రాలు జిల్లాకు కేటాయించనున్నారని సమాచారం. వీటి మూల్యాంకనానికి సరిపడా స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. కానీ సోషల్ స్టడీస్, హిందీ సబ్జెక్టులకు టీచర్ల కొరత ఉంది. మూల్యాంకనానికి 57 సంవత్సరాలు వయసు దాటిన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో అనకాపల్లి జిల్లాకు చెందిన కొందరు టీచర్ల సేవలు వినియోగించాలని భావిస్తున్నారు. రెండుమూడు రోజుల్లో వారికి ఆర్డర్లు పంపనున్నారు. వారం పదిరోజుల్లో మూల్యాంకనం పూర్తిచేయాలని విద్యాశాఖ నిర్ణయించడంతో ఏర్పాట్లుచేస్తున్నారు.

నేటి నుంచి ఇన్విజిలేటర్ల జంబ్లింగ్

పదోతరగతి లాంగ్వేజస్ పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. సోమవారం గణితం పరీక్ష. నిబంధనల మేరకు లాంగ్వేజస్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించే వారిలో సగం మందిని జంబ్లింగ్ విధానంలో సమీపంలోని పరీక్షా కేంద్రాలకు పంపుతారు. ప్రతి కేంద్రంలో సేవలందించే వారిలో సగం మందిని ఈ విధానంలో మారుస్తారు.

బయటపడని నివేదిక!

- ఏయూలో పదోన్నతుల వ్యవహారం
- ఆరేళ్ల కిందటే నివేదిక సమర్పించిన విచారణ కమిటీ
- ఇప్పటికీ వివరాలు వెల్లడించని అధికారులు



విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలువురు ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా ఆరేళ్ల కిందట పదోన్నతులు కల్పించారు. ఈ వ్యవహారంపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో 2018 డిసెంబరు 19వ తేదీన 'ఆచార్యుల పదోన్నతులపై ఏయూలో రచ్చ' శీర్షికన కథనం కూడా ప్రచురితమైంది.

ఈ కథనంపై స్పందించిన ఉన్నత విద్యా మండలి పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ ఓ కమిటీని నియమించింది. ఇందులో అప్పటి సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్ఎస్) చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.రాధాకృష్ణ, విక్రమ సింహపురి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీఆర్ విశ్వేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పీఎస్ఎన్ రెడ్డిని సభ్యులుగా నియమించింది. ఈ కమిటీ అనేక అంశాలను పరిశీలించి 2019లో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తరువాత ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో నివేదిక మరుగున పడిపోయింది. ఈ విషయం తాజాగా వర్సిటీలోని పలువురు ప్రొఫెసర్ల దృష్టికి వచ్చింది. దీనిపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది.

సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులు వ్యవహారంలో కమిటీ అనేక లోటుపాట్లను నివేదికలో ప్రస్తావించినట్టు తెలిసింది. ఈ నివేదిక బయటపడితే ఎంతోమంది నష్టపోవాల్సి వస్తుందని, అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి, వర్సిటీలో చక్రం తిప్పిన ఓ ఉన్నతాధికారి నివేదిక వెలుగుచూడకుండా చక్రం తిప్పినట్టు చెబుతున్నారు.

సీనియర్లకు అన్యాయం

జీవో 38 ప్రకారం 2018లో పదోన్నతులు ఇచ్చినట్టు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు వర్సిటీ ప్రొఫెసర్లలో పదింట ఒకవంతు మందికి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించేందుకు అవకాశం ఉంది. దీని ప్రకారం 14 మందికి సీనియర్ ప్రొఫెసర్లుగా అవకాశం ఇవ్వాలి. కానీ 11 మందితో సరిపెట్టారు. పదోన్నతికి సంబంధించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని సక్రమంగా పరిశీలించకుండానే పలువురికి పదోన్నతులు కల్పించినట్టు విమర్శలు రావడంతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతులు వ్యవహారంలో అనుసరించిన విధానాలపై ఆటా ద్వారా ఏయూ పాలకులకు అప్పట్లో ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అనర్హులకు పదోన్నతులు కల్పించడం వల్ల అర్హులైన వారు కీలక పదవులకు దూరం కావాల్సి వచ్చిందని, ఆర్థికంగానూ నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నత విద్యామండలి నాటి కమిటీ నివేదికను బయటపెట్టి నష్టపోయిన సీనియర్ ప్రొఫెసర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

40 కేసులూ ఓపెన్ చేయండి

- మూసివేసిన వాటిపై సీపీ యాక్షన్
- పోలీసు అధికారులకు ఆదేశం



విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆధారాలు దొరకలేదనే కారణంతో మూసివేసిన కేసులపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించారు. ఇటీవల జరిగిన నేర సమీక్ష సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలపై సీసీఆర్‌బీ అధికారులతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్ల హౌస్ ఆఫీసర్లను ఆరా తీశారు. కమిషనరేట్ పరిధిలో అన్‌డిటెక్టబుల్ (యూఎన్) కేసులు 40 ఉన్నట్టు అధికారులు సీపీకి వివరించారు. దీంతో ఆయా కేసులను తిరిగి ఓపెన్‌చేసి దర్యాప్తు పునఃప్రారంభించాలని ఆదేశించారు. కొన్ని ముఖ్యమైన కేసులు, పోలీసుల దర్యాప్తునకు సవాల్‌గా మారిన కేసులను ప్రత్యేక అధికారులకు అప్పగించి చిక్కుముడి విప్పాలని సీపీ నిర్ణయించారు.

ఇందులో భాగంగా కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల కిందట జరిగిన రౌడీషీటర్ గనగళ్ల శ్రీను హత్య కేసు ను కేస్ స్టడీగా తీసుకుని, దర్యాప్తు బాధ్యతలను కంట్రోల్‌రూమ్ సీఐ షేక్ హుస్సేన్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తును సవాల్‌గా తీసుకుని దర్యాప్తు పునఃప్రారంభించిన సీఐ షేక్‌హుస్సేన్ సిబ్బంది సహాయంతో హత్యకేసు చిక్కుముడిని ఛేదించి నిందితులను సాక్ష్యాధారాలతో సహా అరెస్టు చేశారు. ఈ కేసును స్ఫూర్తిగా తీసుకుని మూసివేసిన కేసుల్లో ఒకదాని తర్వాత ఒకటిగా చిక్కుముడి విప్పుతామని సీపీ వివరించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (సోమవారం సాయంత్రం)

సహర్ : 4.40 (మంగళవారం ఉదయం)


మాఢవీధిలో ఏర్పాటు చేసిన బోర్డు

సింహగిరిపై రైల్వే సమాచారం బోర్డు

సింహాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సింహగిరిపై మాడవీధిలో రైళ్ల సమయాలను తెలిపే బోర్డు ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి విజయనగరం మీదుగా వెళ్లే రైళ్లు, విశాఖ నుంచి విజయవాడ మీదుగా వెళ్లే రైళ్ల నంబర్లు, పేర్లు, అవి విశాఖ స్టేషన్ నుంచి బయలుదేరే సమయాలను బోర్డులో పేర్కొన్నారు. ఈఓ సుబ్బారావు ఆదేశాల మేరకు ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న మాడవీధిలో ఇంజినీరింగ్ సిబ్బంది వీటిని ఏర్పాటు చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెం కేజీబీవీలో ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.6వ తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40, సెకండ్ ఇయర్‌లో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు వచ్చేనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

98వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

సింహాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించినట్టు కార్పొరేటర్ పివి నరసింహం తెలిపారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వార్డులోని పద్మావతినగర్, సూర్యకాంత్‌నగర్, సింహపురి లేఅవుట్ సమీపంలో రిటైనింగ్ వాల్, గోశాల లేఅవుట్‌లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని విన్నవించినట్టు చెప్పారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై స్వామివారికి ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు ప్రదీప్

వరాహలక్ష్మీనృసింహస్వామిని బుల్లి తెర నటుడు,సినీ హీరో ప్రదీప్ మాచిరాజు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన అనంతరం బేడ మండప ప్రదక్షిణ, అమ్మవారికి పూజలు నిర్వహించారు. పండితులు ఆయన పేరుతో అర్చనలు జరిపి, ప్రసాదాలు అందజేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. హెచ్‌బీ కాలనీ, కృష్ణా కళాశాల రహదారిలో ఉదయం వాకింగ్‌కు వచ్చిన సుంకర అప్పారావు (60)ను గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

అగ్నిమాపక కేంద్రం లేక అవస్థలు

- తరచూ ప్రమాదాలతో ఆందోళన
- మధురవాడలో ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి

కొమ్మాది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ప్రమాదాలు జరిగే సమయంలో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, బోయిపాలెం వరకు బహుళ అంతస్తుల భవనాలు వెలసాయి.ఇక్కడికి వివిధ జిల్లాల నుంచి ఉపాధి, వ్యాపార, ఉద్యోగ అవకాశాల నిమిత్తం వలస వచ్చి జీవనం సాగిస్తున్న వారే అధికం. ఎక్కువగా మధ్య, దిగువ తరగతి ప్రజలతో పాటు పేదలు కూడా నివసిస్తున్నారు. చాలా మంది కొండవాలు ప్రాంతంలో పాకలు వేసుకుని ఉంటున్నారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే సర్వం కాలిబూడిదవ్వడం తప్ప మరో దారి లేదు. స్థానికంగా అగ్ని మాపక కేంద్రం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగితే అటు నగరం నుంచి లేదా చిట్టివలస నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అంతదూరం నుంచి సిబ్బంది వచ్చేసరికి


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అధిక సమయం పట్టడంతో భారీగా నష్టం జరుగుతుంది. ఆదివారం బోరవానిపాలెం దరి స్క్రాప్ దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికులు చిట్టివలసలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా అక్కడి నుంచి సిబ్బంది వచ్చేసరికి స్క్రాప్ నిల్వలు మొత్తం కాలిబూడిదయ్యాయి.అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు ఎప్పటి నుంచో పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా... ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు మధురవాడలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్క్రాప్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లే రోడ్డు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిని ఆనుకుని ఓ వ్యక్తి నగరంలోని చిన్న చిన్న స్క్రాప్ దుకాణాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు కొనుగోలు చేసి, వాటిని మిషనరీ ద్వారా పొడి చేసి తిరిగి హోల్‌సేల్‌గా ఎగుమతి చేస్తుంటాడు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో దుకాణంలో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. వెంటనే స్థానికులు చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు రెండుశకటాలతో వచ్చి మంటలు అదుపు చేశారు. దుకాణం మొత్తం మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేయడానికి చాలా శ్రమిం చాల్సి వచ్చింది. ఈ ఘటనలో రూ. 30 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు. ప్రమాదం సమయంలో భారీగా పొగ వ్యాపించడంతో చుట్టుపక్కల నివాసితులు, జాతీయ రహదారిపై ప్రయాణించేవారు ఆందోళనకు గురయ్యారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందన్నది తెలియలేదు. పీఎంపాలెం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

జోరుగా అక్రమ కట్టడాల కూల్చివేత

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ సీఆర్‌జడ్ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాల కూల్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి. సముద్ర కెరటాల సమీపంలో సుమారు 11 అడుగుల భూగర్భంలో అతిబలంగా నిర్మించిన కాంక్రీట్ స్ట్రక్చర్‌ను తొలగించడానికి భారీ యంత్రాలను వినియోగిస్తున్నారు.అలాగే హోండాయ్ ఇఎక్స్ 200, హెచ్‌పీ 215 సామర్థ్యం కలిగిన అతిపెద్ద బ్రేకర్స్‌ను, భారీ బకెట్ కలిగిన జేసీబీని వినియోగించి కట్టడాలు తొలగిస్తున్నారు. కట్టడాల తొలగింపులో చాలావరకు యంత్రాలు మరమ్మతుకు గురవుతున్నాయి. సుమారు 588 రన్నింగ్


భారీ యంత్రాలతో తొలగిస్తున్న కట్టడాలు

మీటర్ల పొడవున రెండు పొడవాటి వాల్స్‌ను స్ట్రాంగెస్ట్ కాంక్రీట్ వాల్స్‌ను అక్రమంగా నిర్మించారు. ఇక్కడ 7 స్టార్ హోటల్ కోసం అవ్యాన్ సంస్థ నిర్మాణాలు చేపట్టిందని కొందరు భావిస్తుండగా, మరికొందరు ప్రైవేటు టూరిస్ట్ క్రూయిజ్ టెర్మినల్ కోసం నిర్మాణాలు జరిగాయని చెబుతున్నారు. ఏదిఏమైనా కోర్టు ఆదేశాల మేరకు అధికారులు కొన్ని రోజులుగా అక్రమ కట్టడాలను తొలగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, డీసీపీలు, ఏఈ సురేశ్ పనులను పరిశీలించారు. కాగా ఆదివారం ఉదయం మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంబంధిత ప్రదేశాన్ని పరిశీలించారు. సుమారు 15 నిమిషాల పాటు అక్కడ ఉన్నారు.అనంతరం భీమిలి బ్యాంక్ రోడ్‌లో ఉన్న ఒక పురాతన గెస్ట్ హౌస్‌కు వెళ్లినట్టు తెలిసింది.


సముద్ర తీరంలో సందర్శకుల కేరింతలు

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. విశాఖ, విజయనగరం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఇసుక తిన్నెలపై ఆటలాడుతూ బంధువులు, స్నేహితులతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.కాగా రహదారికి ఇరువైపులా బైక్‌లు, కార్లు ఇష్టానుసారం నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

2.95 లక్షల మొక్కల పెంపకానికి సన్నాహాలు

పద్మనాభం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి పథకం ద్వారా మూడు నర్సరీలు ఏర్పాటు చేసి 2.95 లక్షల మొక్కలు తయారు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు రూ. 25. 17 లక్షలతో పద్మనాభం, అర్చకునిపాలెం, శేరిఖండంలో నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే నీలగిరి, సరుగుడు నారు వేశారు. వేప, మునగ, ఉసిరి, జామ, సీతాఫలం తదితర మొక్కలను పెంచి జూన్‌లో జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో నాటడానికి సన్నాహాలు చేస్తున్నారు. పద్మనాభంలో 95 వేల మొక్కలు పెంపకానికి రూ.8.28 లక్షలు, అర్చకునిపాలెంలో 1.05 లక్షల మొక్కలు పెంపకానికి రూ. 8.61లక్షలు, శేరిఖండంలో నర్సరీ అభివృద్ధికి రూ.8.28 లక్షలు కేటాయించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో దంపతుల అరెస్ట్

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గొల్లలపాలెంలో వివాహిత పీతల రాజేశ్వరి ఆత్మహత్యకు కారణమైన గుడ్డాల ఉజ్వల, ఆమె భర్త సురేశ్‌ను ఆదివారం అరెస్టు చేసినట్టు భీమిలి సీఐ తిరుమలరావు తెలిపారు. ఈ నెల 21న ఉజ్వల మానసిక వేధింపులు తాళలేక రాజేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతురాలి భర్త వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఉజ్వల, ఆమె భర్త సురేశ్‌ను అరెస్టు చేశారు. కాగా ఉజ్వలకు గైనిక్ సంబంధిత సమస్యలు ఉండడంతో మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రామారావు ఆదేశాలతో కేజీహెచ్‌లో చికిత్సకు తరలించారు. సురేశ్‌ను కేంద్ర కారాగారంలో రిమాండ్‌కు తరలించారు.

200 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్‌లో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికోవర్, ప్రజ్వల్ డెంటల్ వైద్యులు సుమారు 200 మంది రోగులకు పలు పరీక్షలు చేసి, మందులు అందించారు. అయ్యప్ప భక్తుడు, గురుస్వామి స్వర్గీయ అడిదం సన్యాసిరాజు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు ముత్తంశెట్టి మహేష్, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, సేవా సంఘం నాయకులు కె. ఎర్రునాయుడు, ఎం. నరసింగరావు, కె. ముత్యాలరావు, కె. జగన్నాథం, పి. శ్రీను, గుగ్గిళ్ల సాయి, సునరావు మాధవశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

తగరపువలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జీఆర్ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్థంతి సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, సుంకర రామప్రసాద్, కానూరి రాంబాబు, రామ్‌పైడి, అప్పలరాజు పాల్గొన్నారు.

అనంతవరంలో పరిసరాల పరిశుభ్రత



ఆలయ పరిసరాలను శుభ్రం చేసిన సభ్యులు

పద్మనాభం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామంలో ఉన్న శ్రీమన్నారాయణేశ్వర ఆలయంలో ఈస్టర్న్ ఘాట్ ట్రెక్కింగ్ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, భైరవ సైకిల్ గ్రూపు సభ్యులు ఆదివారం శ్రమదానం చేపట్టారు. ఆయా సంస్థల సభ్యులు ప్రతి ఆదివారం నగర పరిధిలోని ఆలయాలను సందర్శించి, పరిసరాలను శుభ్రం చేస్తుంటారు. దీనివల్ల వ్యక్తిగత ఆరోగ్యం పెంపొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాదరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన క్రీడా పోటీలు

సాగర్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :గీతం వర్సిటీలో వారం రోజులుగా జరుగుతున్న గీతం స్టాఫ్ క్రీడా పోటీలు ఆదివారం ముగిసాయి. గీతం వర్సిటీ అధ్యాపకులకు, సిబ్బందికి మధ్య పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరగ్గా సుమారు 500 మంది పాల్గొన్నారు. బ్యాడ్మింటన్‌లో 65 మంది పురుషులతో పాటు 25 మంది మహిళలు పాల్గొనగా వాలీబాల్ టోర్నీలో 135 మంది సభ్యులు 15 జట్లుగా ఏర్పడి టైటిల్ కోసం పోటీ పడ్డారు. క్రికెట్‌లో 21 జట్లు నాకౌట్ పద్ధతిలో పోటీ పడ్డాయి. గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ విజేతలకు బహుమతులు అందించారు.

చిట్టివలస జూట్‌మిల్లు కార్మికులకు అన్యాయం

మిల్లు లాకౌట్ బాధితుల సంఘం

తగరపువలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో పనిచేసిన కార్మికులకు మిల్లు యాజమాన్యం, కార్మిక సంఘాలు అన్యాయం చేశాయని మిల్లు లాకౌట్ బాధితుల సంఘం ఆరోపించింది. ఆదివారం చిట్టివలస కార్మిక సంక్షేమ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు నాగోతి అప్పలరాజు విలేకరులతో మాట్లాడారు. 2009లో యాజమాన్యం లాకౌట్ ప్రకటించిందని, అప్పటి నుంచి తన ఆధీనంలో ఉన్న భూములను అమ్మకాలు చేస్తోందన్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన సంఘాలు యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. భూముల అమ్మకాలు చేయరాదని తమ సంఘం తరఫున కోర్టులో కేసులు వేశామన్నారు. అయినా, పట్టించుకోకుండా బినామీ పేర్లతో యాజమాన్యం అమ్మకాలు చేపట్టిందన్నారు. కార్మిక నాయకులతో యాజమాన్యం చేసుకున్న జీతాల ఎగ్రిమెంటు కూడా సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. సంఘం ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరమణ మాట్లాడుతూ యాజమాన్యం ఆధీనంలో ఉన్న 16 ఎకరాలను రూ.161 కోట్ల 11 లక్షలకు భీమిలి, ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో యరబాల తాతారావు, జన్నుల రమణ, దాలయ్యరెడ్డి, శివ, అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగోతి అప్పలరాజు

రుషికొండ బీచ్ అభివృద్ధికి చర్యలు

- పర్యాటక శాఖా మంత్రి దుర్గేశ్
- బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణ పట్ల హర్షం

సాగర్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణ పట్ల రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీచ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలో బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్‌ల్లో రుషికొండ ఒకటని తెలిపారు. బీచ్‌లో నిరంతరం భద్రతా చర్యలు, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్, నీటి శుద్ధి, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

మాజీ మంత్రి గంటా హర్షం

విశాఖపట్నం : రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ పునరుద్ధరించడం పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలకు అనుగుణంగా బీచ్‌లో సౌకర్యాలు లేకపోవడంతో గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేసిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి ఇక్కడికి వారాంతాల్లో 70 వేలకు పైగా పర్యాటకులు వస్తున్నారని, మరిన్ని సౌకర్యాలు పెంచడం ద్వారా పర్యాటకుల సంఖ్య పెంచుతామని తెలిపారు. 15 రోజుల క్రితం తాను స్వయంగా బీచ్‌ను సందర్శించానని, బీచ్‌లో మరిన్ని ప్రమాణాలు మెరుగుపరచడానికి అధికారులకు పలు సూచనలు చేశామని వెల్లడించారు. ముఖ్యంగా పరిశుభ్రత, నీటి నాణ్యత, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాల్లో బ్లూఫ్లాగ్ నిర్వాహకుల అభ్యంతరాలను యుద్ధప్రాతిపదికన సరిచేశామని పేర్కొన్నారు.

క్రెడాయ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

సాగర్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ ఏ 1 గ్రాండ్‌లో క్రెడాయ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. చైర్మన్‌గా బుద్ధిగ శ్రీనివాస్,అధ్యక్షుడిగా బాయన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా డి.రాంబాబు (విజయవాడ),వైస్ ప్రెసిడెంట్లుగా సాయిరామ్ రెడ్డి, జీవీఎస్‌టీ రాయుడు, జాయింట్ సెక్రటరీలుగా కెఎస్ఆర్‌కె రాజు (సాయి), కె. విజయరామకృష్ణ, వినోద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో క్రెడాయ్ అధ్యక్షుడు బాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రెడాయ్ 20 నగరాల చాప్టర్లతో 1200 డెవలపర్ల సభ్యత్వాన్ని కలిగి ఉందన్నారు.దక్షిణ భారత్‌లో అతిపెద్ద అసోసియేషన్‌గా స్థిరపడిందని, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతను పెం పొందిస్తుందని తెలిపారు. జాతీయ అత్యున్నత సంస్థగా రూపొందిందన్నారు. భవన నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యతమిచ్చేలా సంస్థ పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. క్రెడాయ్ చైర్మన్ బుద్ధిగ శ్రీనివాస్ (రాజమహేంద్రవరం) మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ డెవలపర్లకు తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు.అందులో భాగంగా ఇప్పటికే కొన్ని జీవోలను జారీ చేసినట్టు తెలిపారు. విజయవాడ కేంద్రంగా క్రెడాయ్ ఏపీ నూతన కార్యాలయం నిర్మాణం దిశగా అడుగులు వేస్తుందన్నారు. అనంతరం జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు క్రెడాయ్ విశిష్టతను వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న క్రెడాయ్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు

పదవుల కోలాహలం

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. మేయర్‌గా పీలా శ్రీనివాస్‌ను కాదంటే తమకు అవకాశం ఇవ్వాలని యాదవ సామాజికవర్గానికి చెందిన ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత 26 వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి కూటమి నేతల వద్ద ప్రతిపాదించినట్టు తెలిసింది. ఒక డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించడం ఖాయమని, 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మికి ఇవ్వాలని ఆ పార్టీ నేతలు కోరినప్పటికీ, మేయర్‌గా పీలా శ్రీనివాస్‌కు అవకాశం ఇస్తే అదే సామాజికవర్గానికి బీశెట్టి వసంతలక్ష్మికి అవకాశం దక్కకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. అలాంటపుడు కాపు సామాజికవర్గానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ కోరుతున్నట్టు సమాచారం. మరో డిప్యూటీ మేయర్ పదవిని కాపు సామాజిక వర్గానికి చెందిన 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకి దక్కడం ఖాయమని ప్రచారం జరుగుతున్నప్పటికీ, జనసేన నుంచి కాపు సామాజికవర్గానికి అవకాశం ఇస్తున్నందున యాదవ సామాజికవర్గానికే ఇవ్వాల్సి ఉంటుందని ఐదో వార్డు కార్పొరేటర్ హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఒత్తిడి చేస్తున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. టీడీపీ ఫ్లోర్ లీడర్ పదవి కోసం కూడా పలువురు పోటీ పడుతున్నారు. ఇదిలావుంటే ఇటీవల వైసీపీ నుంచి టీడీపీ,జనసేనలో చేరిన కార్పొరేటర్లంతా వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత లేకపోవడం వల్లే పార్టీ మారిపోవాల్సి వచ్చిందని, ఇక్కడైనా ప్రాధాన్యం దక్కాలంటే ఒకరికైనా పదవి దక్కేలా ఏకాభిప్రాయంతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆశావహులంతా ఎవరికివారు నేతలపై ఒత్తిడి చేస్తుండడంతో వారంతా ఎవరికీ హామీ ఇవ్వలేక తల పట్టుకుంటున్నారు. ముందు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గితే, తర్వాత పదవుల పంపకంపై దృష్టిపెడదామంటూ తప్పించుకుంటున్నారు.

నేడే ఐపీఎల్ సమరం

... 5వ పేజీ తరువాయి

స్టేడియంలోకి ప్రవేశించడానికి 20 గేట్లు ఏర్పాటు చేశారు. గేట్ నంబరు 1 నుంచి క్రికెటర్లు, మ్యాచ్ అఫీషియల్స్, ఏసీఏ, బీసీసీఐ, ప్రభుత్వ అధికారులు, ఈస్ట్, వెస్ట్ పెవిలియన్, 1 నుంచి 18 కార్పొరేట్ బాక్సులకు ప్రవేశం కల్పించారు. 2వ గేటు నుంచి సౌత్‌వెస్ట్ అప్పర్, 19 నుంచి 26 కార్పొరేట్ బాక్సులకు వెళ్లేవారికి ప్రవేశం ఉంటుంది. 3వ గేటు సౌత్‌వెస్ట్ అప్పర్, 4- బి స్టాండ్, 5-ఎ స్టాండ్, 6-సి స్టాండ్, 7-డి, డి1 స్టాండ్‌లు, 8-ఇ, ఇ1 స్టాండ్లు, 9-ఎఫ్, ఎఫ్1 స్టాండ్లు, 10-జి స్టాండు ద్వారా ప్రవేశం కల్పిస్తారు. 11- కామెంటేటర్స్, బీసీఆర్ రూం, మీడియా, 12-హెచ్ అండ్ జె స్టాండ్స్ 13-ఐ స్టాండ్, 14-కెస్టాండ్, 15- ఎం స్టాండ్, 16ఎ-ఎం1 స్టాండ్, 16-ఎల్ స్టాండ్, 17-ఎన్ స్టాండు, 18- ఓ స్టాండ్, 19-సౌత్‌ఈస్ట్ లోవర్, 20- సౌత్‌ఈస్ట్ అప్పర్ 27 నుంచి 34 వరకు ఉన్న కార్పొరేట్ బాక్సులకు ప్రవేశం కల్పిస్తారు. ప్రేక్షకులు కెమెరాలు, మ్యాచ్‌బాక్సులు, లైటర్లు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, మండే స్వభావంగల వస్తువులు, పొగాకు ఉత్పత్తులు, టిఫిన్లు, పదునుగా ఉన్న వస్తువులు, తినుబండారాలు, గొడుగులు, క్రేకర్స్ జంతువులు, రేడియో, ఆల్కహాల్, కర్రలు, లేజర్‌లైట్లు, బెలూన్లు, గ్లాస్‌బాటిళ్ళు, పెర్‌ఫ్యూమ్స్, స్ప్రే బాటిళ్లు, సిరంజిలు, విజిల్స్, హారన్స్, స్పోర్టింగ్ బాల్స్, రోలర్ స్కేటర్లు, ప్రమోషనల్ ప్రొడక్ట్స్, ల్యాప్‌ట్యాప్‌లు, పెన్నులు, పెన్సిళ్లు తీసుకురాకూడదు.

ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్ : పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో సోమవారం జరగనున్న ఐపీఎల్ టి-20 క్రికెట్ మ్యాచ్‌కు ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులు నడపనుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాభిమానులను తరలించేందుకు, మ్యాచ్ ముగిసిన తరువాత వారిని ఆయా ప్రాంతాలకు చేర్చేం దుకు బస్సులు అందుబాటులో ఉంటాయి. రాత్రి 7.30 నుంచి 11 గంటల వరకు మ్యాచ్ జరుగుతుందని,దీంతో సాయంత్రం 5.30 నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 11 నుంచి 1 గంట వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. గాజువాక, పాతపోస్టాఫీస్, సింహాచలం, కూర్మన్నపాలెం, తగరపువలస ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అనే భావన కేంద్ర సర్వే బృందానికి ఉంటుంది. పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం ఎలా ఉందనేదానిని పరిశీలిస్తుంది. కాబట్టి బీచ్‌లో యంత్రాలతో చెత్తసేకరణ చేసి పరిశుభ్రంగా ఉంచుతున్నాం. పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, బీచ్‌లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతున్నాం.

ప్రశ్న: లిక్విడ్ వేస్ట్ రీసైక్లింగ్ విభాగంలో జీవీఎంసీ పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: స్వచ్ఛసర్వేక్షణ్‌లో లిక్విడ్‌వేస్ట్ (మురుగునీరు పునర్వినియోగం) రీసైక్లింగ్ కీలకం. గత కొన్నేళ్లుగా ఈ అంశంలో కొంత వెనుకబడినప్పటికీ ఇటీవల ఉన్నతాధికారుల ప్రత్యేక చొరవతో బీచ్‌లో కలుస్తున్న మురుగునీటిని ఎస్‌టీపీలకు మళ్లిస్తున్నాం. అలాగే యూజీడీ ద్వారా ఎస్‌టీపీలకు చేరిన మురుగునీటిని శుద్ధిచేసి పరిశ్రమలకు విక్రయిస్తున్నాం. దీనివల్ల జీవీఎంసీకి ఏటా రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతోంది.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితులు అరెస్టు

ఎంవీపీ కాలనీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ, భీమిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు బైక్‌లు, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్, ల్యాప్‌టాప్, రెండు మొబైల్ ఫోన్లు చోరీ చేసిన ఇద్దరు నిందితులను ఎంవీపీ నేర విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ చక్రధరరావు తెలిపిన వివరాల మేరకు.. చినవాల్తేరు రెల్లివీధికి చెందిన ఎర్రంశెట్టి అవిక్ కుమార్ (18), పెద జాలారిపేటకు చెందిన డోల పైడిరాజు అలియాస్ పండును పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. కేసును ఛేదించిన సీఐ, క్రైమ్ ఎస్ఐ అప్పలరాజు, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు హరిప్రసాద్, జగత్ కిరణ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 13న ప్రవేశ పరీక్ష

ఎంవీపీ కాలనీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో అయిదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్టు రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా సమన్వయాధికారి డాక్టర్ సి.ప్రభావతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి విశాఖ జిల్లా పరిధిలోని మూడు గురుకుల సంస్థలు, అనకాపల్లి జిల్లా పరిధిలోని ఎనిమిది గురుకులాల్లో అయిదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 6న జరగాల్సి ఉంది. ఈ పరీక్షను వచ్చే నెల 13కి వాయిదా వేసినట్టు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, వారికి కేటాయించిన కేంద్రానికి మాత్రమే వెళ్లాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు : 0891 2799641లో సంప్రదించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందిన మరుపల్లి ప్రవీణ్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. అయిదు లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరు పత్రాన్ని ప్రవీణ్ కుటుంబానికి తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, వెలగపూడి ప్రతాప్ రుద్ర ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో నాయకులు కర్రి రామారావు, మాసేను, నూకరత్నం, ఎల్లాజీ, గురయ్య, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు



మద్దిలపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతాకు చెందిన వెల్‌రెడ్ ఫౌండేషన్ 2025 డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డును డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు పోలా ఉమామహేశ్వరరావుకు ప్రకటించింది. జాతీయ సేవా పథకం అధికారిగా ఉన్న ఉమామహేశ్వరరావుకు సామాజిక సేవా విభాగంలో ఈ అవార్డును అందించింది. గతంలో ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తమ జాతీయ సేవాపథకం అధికారి అవార్డు పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, సిబ్బంది ఉమామహేశ్వరరావును అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

కంబాలకొండకు తగ్గిన సందర్శకుల తాకిడి

- ఎండలు, పరీక్షల సీజన్ కావడంతో తగ్గుముఖం
- బోటు షికారు లేక తీరానికే పరిమితమైన బోట్లు

ఆరిలోవ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల నేపథ్యంలో కంబాల కొండ నేచురల్ పార్కునకు వచ్చే సందర్శకులు సంఖ్య గణనీయంగా తగ్గింది. అలాగే విద్యార్థులకు పరీక్షల సీజన్ కావడం కూడా ఒక కారణం. సాధారణ రోజుల్లో ఈ పార్కు సందర్శకులతో కళకళలాడుతుంటుంది. అయితే ప్రస్తుతం సందర్శకుల తాకిడి అంతగా లేకుండాపోయింది. వేసవి కావడంతో ఎండలు తీవ్రంగా ఉండ డంతో పాటు ఇది పరీక్షల సీజన్ కావడమే సందర్శకుల తగ్గడానికి కారణమని పార్కు సిబ్బంది అం టున్నారు. బోటు షికారు నిమిత్తం కంబాలకొండ చెరువు వద్ద సుమారు 20 వరకు పడవలు ఉన్నవి. అయితే ప్రస్తుతానికి సందర్శకులు తగ్గ డంతో బోటు షికారుకు అంతగా లేకుండా పోయింది. దీంతో చెరువు వద్ద ఉన్న బోట్లు డిమాండ్ లేక ఖాళీగా ఉంటున్నాయి. సాధారణ రోజుల్లో ఈ పార్కులో బోటు షికారుకు బాగా డిమాండ్ ఉంటుంది. సందర్శకులు ఈ బోట్లు ఎక్కి తమకు తాము నడుపుతూ ఎంతో ఉల్లాసంగా గడిపేవారు.


సందర్శకులు లేకపోవడంతో తీరానికే పరిమితమైన బోట్లు

ఎండలు కాస్త తగ్గ డం, పరీక్షల సీజన్ పూర్తయి, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తే పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుందని పార్కు సిబ్బంది అంటున్నారు. అంటే.. ఈ నెలంతా పార్కుకు అన్-సీజనే అన్నమాట.

బీజేపీలో భారీగా చేరికలు


ఎమ్మెల్సీ సోము వీర్రాజును సత్కరిస్తున్న దృశ్యం, పార్టీలో చేరిన నేతలు

పెదవాల్తేరు మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం బీజేపీ విశాఖ పార్లమెంటు జిల్లాఅధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ రాజు అధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ నేతృత్వంలో వైసీపీ నుంచి సుమారు 100 మంది యువనాయకులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు మాట్లాడుతూ నరేంద్ర మోదీ భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు చేపట్టారన్నారు. అంతర్జాతీయంగా పేరు భారతదేశ ప్రతిష్ఠ పెరిగిందని, కులమతాలకు అతీతంగా సాగుతున్న మోదీ పరిపాలనకు ఆకర్షితులై అనేక మంది బీజేపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్ విజయేంద్రరెడ్డి, బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుహాసినీఆనంద్, టి.సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఖాళీ చేయించడమే లక్ష్యం

- విశాఖ స్టీల్‌ప్లాంటు నష్టానికి కార్మిక నేతలే కారణం
- ఎమ్మెల్సీ సోము వీర్రాజు


సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

పెదవాల్తేరు మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి లక్ష్యం వైసీపీ పూర్తిగా ఖాళీ చేయడమని, మాజీ సీఎం జగన్ ఈ మధ్య ఏదో గట్టిగా మాట్లాడుతున్నారని, పోలీసులను సైతం బెదిరిస్తున్నారని, జగన్‌కు కనీసం 20 శాతం ఓట్లు రానీ యకుండా చేస్తామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు ప్రతిపక్షం ఇవ్వలేదని, కానీ ఆయన మాత్రం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా కావాలని అంటున్నారన్నారు. జగన్ విశాఖను రాజధాని చేస్తానని సుమారు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటు నష్టానికి కార్మిక నేతలే కారణమన్నారు. స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నాయకుల ఆస్తులు మీద విచారణ చేయాలన్నారు. దేశంలో నెంబర్‌వన్ స్టీల్‌ప్లాంటుగా విశాఖ స్టీల్‌ప్లాంటును నిలబెట్టాలని ప్రధాని మోదీ ఆలోచిస్తున్నారన్నారు. జపాన్ తరహాలో తక్కువ మంది కార్మికులున్నా, ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నారన్నారు. విశాఖస్టీల్‌ప్లాంటుకు రూ.11,400 కోట్లు ఇచ్చామని, ఐనా సరే టెంట్లు వేసి ధర్నా చేస్తున్నారని, అసలు అక్కడ నిరసన చేస్తున్న కార్మిక సంఘాలు నాయకులు ఎక్కడ నుంచి వచ్చారన్నారు. వాళ్లకు రష్యా, చైనా బాగుండాలని, ఆ జెండాలు కట్టుకునే నాయకులే ఉన్నారన్నారు. పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖను విజయవంతంగా నడుపుతున్నారన్నారు. విద్యాశాఖా మంత్రి పేరెంట్ కమిటీ కొనసాగింపు చేశారన్నారు. ఇప్పుడు ఉన్న కేబినెట్ అద్భుతంగా పని చేస్తున్నదని, చాలా సమర్థవంతంగా మంత్రులు పని చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్. విజయేంద్ర రెడ్డి, బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుహాసినీఆనంద్, టి. సుబ్బరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతికి ఆధ్యాత్మికమే చక్కని మార్గం

పార్లమెంటు మాజీ సభ్యుడు గోకరాజు రంగరాజు


స్వామివారి చిత్రపటాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు

మహరాణిపేట, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతికి ఆధ్యాత్మిక మార్గమే చక్కని మార్గమని మాజీ పార్లమెంటుసభ్యులు గోకరాజుగంగరాజు పేర్కొన్నారు. వైకుంఠగిరి శ్రీఅనంతవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రీన్‌పార్కు హోటల్‌లో ఆలయ ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గోకరాజు గంగరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామి వారి చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనం సన్మార్గంలో పయనించడానికి ఆధ్యాత్మికం ఎంతో దోహదపడుతుందన్నారు. ఆధ్యాత్మికతను జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. మానసిక రుగ్మతలను సైతం ఆధ్యాత్మికత నిర్మూలిస్తుందన్నారు. సనాతన ధర్మం ద్వారా దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఆలయ ధర్మకర్త సముద్రరెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.పదికోట్లతో రెండేళ్ల క్రితం శ్రమించి వైకుంఠగిరి శ్రీ అనంతవెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని నిర్మించడం, ప్రతిష్ఠింపజేసే అవకాశం లభించడం ఆ వేంకటేశ్వరస్వామి కల్పించిన అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ స్వామి వారిని దర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని కోరారు.

కార్యక్రమంలో విద్యాకౌన్సిల్ మాజీ సభ్యులు జీఏ నారాయణరావు ప్రసంగించారు. బొబ్బిలి వంశస్థులు గోనసీతారామస్వామి, విజయ్‌శ్రీధర్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

వల నిండుగా.. అమ్మకాలు దండిగా

బీచ్ రోడ్డులోని అక్వా స్పోర్ట్ ఎదురు సముద్రంలో పలువురు మత్స్యకారులు ఆదివారం ఉదయం చేపలు వేట సాగించారు. చిన్నపాటి పడవ సహాయంతో తీరం సమీపంలో వలలు వేసి చేపలు పట్టారు. ఈ వలకు భారీగా చేపలు చిక్కడంతో మత్స్యకారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చేపలు కొనుగోలు చేయడానికి నగరవాసులు భారీ సంఖ్యలో చేరుకుని గుమిగూడారు. కొద్ది క్షణాల్లోనే పడిన చేపలన్నీ అమ్ముడుకావడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పేదల ప్రయోజనం కోసమే గ్రామ సభలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ప్రభుత్వ సహాయసహకారాలు అందించేందుకే గ్రామ సభలను ఏర్పాటు చేసినట్టు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పేర్కొన్నారు. వార్డులోని సింహాద్రిపురం సచివాలయంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ భాగ్యశ్రీ పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామ సభలో కార్పొరేటర్ పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ నిరుపేద ప్రజలను గుర్తించి వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం కొండవాలు ప్రాంత ప్రజలు తమ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. తొందరలోనే వారి సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, జగదీష్, రాజు సచివాలయాల సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పోలమాంబ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిద్దాం

- టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్


జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పట్టాభిరామ్ తదితరులు

పెదవాల్తేరు మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని శ్రీకరక చెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగానిర్వహిద్దామని, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. ఆదివారం ఉషోదయ జంక్షన్‌లో గల తన కార్యాలయంలో శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారి జాతర నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.గాయత్రి, పోతన్నరెడ్డి, నరేంద్ర, వాసు, యశోద రెడ్డి పాల్గొన్నారు.

మేహాద్రి కాలువలో ఈతకు దిగి యువకుడి మృతి


కాలువ నుంచి సాయిక్రాంతి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

గోపాలపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలువలో ఈతకు దిగిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం ప్రాంతాలకు చెందిన పెయింటింగ్ పనులు చేసుకుంటున్న తొమ్మిది మంది యువకులు పిక్నిక్ కోసం మేహాద్రిగెడ్డకు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. భోజనం చేసిన తరువాత వీరు ఎంఈఎస్ పంపుహౌస్ సమీపంలోని రిజర్వాయర్ కాలువలో ఈతకు దిగారు. ఈ క్రమంలో వీరిలో డబ్బీరు సాయిక్రాంతి (28) నీటిలో మునిగిపోయాడు. దీంతో తోటి మిత్రులు గాలించినా ఫలితంలేకపోవడంతో వారు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి కాలువలో గాలింపు చర్యలు చేపట్టి సాయం త్రం 4 గంటల సమయంలో సాయిక్రాంతి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు మృతుని కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్టుమార్టంనకు తరలించారు. పెందుర్తి సీఐ కేవీ సతీశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా రాజధానిగా విశాఖ

- 60 రోజుల్లోనే పీఎం పాలెం స్టేడియాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం
- త్వరలో వుమెన్ వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యం
- డిసెంబరులో ఇండియా- దక్షిణాఫ్రికా మ్యాచ్
- నేటి ఐపీఎల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని)


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని)

మధురవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రకటించారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్, లఖనవూ సూపర్ జెయింట్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియం అభివృద్ధి పనులు చేపట్టాలని డిసెంబరు 20న నిర్ణయించి, జనవరి 20న పనులు ప్రారంభించామన్నారు. కేవలం 60 రోజుల్లో స్టేడియం రూపురేఖలు పూర్తిగా మార్చివేశామన్నారు. సుమారు రూ.9.5 కోట్ల వ్యయంతో హాలోజిన్ లైట్ల స్థానంలో ఎల్ఈడీ లైట్లు అమర్చామన్నారు. గ్యాలరీలో కుర్చీలు, టాయిలెట్లు, కార్పొరేట్ బాక్సులు, లిఫ్టులు, అదనపు హంగులు సమకూర్చామన్నారు. సెప్టెంబరులో ప్రారంభంకానున్న వుమెన్ వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ఒక మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందన్నారు. ఇండియా టూర్‌లో భాగంగా ఈ స్టేడియంలో సౌతాఫ్రికా డిసెంబరులో ఒక మ్యాచ్ ఆడే అవకాశం వుందన్నారు. రానున్న రోజుల్లో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం మరిన్ని అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు వేదిక కాబోతుందన్నారు. ఏపీఎల్ క్రికెట్ ఫార్మాట్‌ను పూర్తిగా మారుస్తామన్నారు. పాఠశాలల చిన్నారులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పిస్తామన్నారు. సోమవారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిన్ని తెలిపారు. ఈ సీజన్‌లో విశాఖకు రెండు ఐపీఎల్ మ్యాచ్‌లు కేటాయించిన బీసీసీఐ, మ్యాచ్‌లు ఆడుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్లకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్‌బాబు, సీఈవో గిరీష్ పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

వెంకోజీపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-8 పరిధిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను మరమ్మత్తులు చేస్తుండడంతో ఈ నెల 24, 25 పలు ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాయపూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవేపై నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేయు పథకం 900 ఎంఎం వ్యాసం గల బీడబ్ల్యూఎస్సీ ప్రధాన పైపులైను ఉత్తరాపల్లి, మునిడిపల్లి, పాత పెందుర్తి తదితర చోట్ల మరమ్మతులు చేయు నిమిత్తం 24, 25 తేదీల్లో మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ (రెసిడెన్షియల్/ ఇండస్ట్రీస్) నీటి వినియోగదారులకు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు 93 పార్టు నుంచి వార్డు 98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంటక సాయినగర్, బంటా కాలనీ, రవినగర్, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామకో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్ధాంకాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్య రాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వేకాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం తదితర ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నీటి సరఫరాకు అంతరాయం కలిగు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు, ప్రజలకు తాగునీటి సరఫరాలో కలుగు అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

పంచాంగకర్త సుబ్రహ్మణ్య శాస్త్రికి సత్కారం

ఎంవీపీ కాలనీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పంచాంగ కర్త, శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన మావుడూరు సుబ్రహ్మణ్య శాస్త్రిని బాలభాను అర్చక, పురోహిత సంఘం సత్కరించింది. నగరంలోని శివాజీపార్కులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు పాల్గొన్నారు.


ఇంటర్‌లో ద్వితీయ భాషకు ఆప్షన్ ఇవ్వడం సరికాదు

- సంస్కృత అధ్యాపకుల సంఘం డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న సంస్కృత అధ్యాపకులు

మద్దిలపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో ద్వితీయ భాషకు బదులుగా గ్రూప్ సబ్జెక్ట్‌లకు అవకాశమివ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ సంస్కృత అధ్యాపకుల సంఘ (ఏపీఎస్ఎల్ఏ) ఆధ్వర్యంలో శనివారం నగరంలో ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద సంస్కృతం అధ్యాపకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎల్ఏ నాయకులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యలో ద్వితీయ భాషకు ఆప్షన్ ఇవ్వడం వల్ల మాతృభాషలు మరణించే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి మార్పుల వల్ల భాషా ఉద్యోగులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు.సెకండ్ లాంగ్వేజ్‌గా ఉన్న తెలుగు, సంస్కృతం, హిందీ తదితర సబ్జెక్టులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంటర్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సంస్కృత అధ్యాపకుల సంఘం

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు


షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

వెంకోజీపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలో 8 జట్లు పాల్గొని తమ తమ ప్రతిభను కనబరిచారు. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన ఈ పోటీల్లో ఆటగాళ్లు అందరూ తమదైన శైలిలో ఆడారు. కాగా నాగు, అశోక్ జట్టు 21:20 పాయింట్లతో తమ ప్రత్యర్థి జట్టు సుధా, ఏఎస్ఆర్‌లపై విజయం సాధించి కప్పును గెలుచుకున్నారు. విజేతలకు, రన్నర్స్‌కు నిర్వాహకులు శ్రీను కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రౌండ్ సభ్యులు పీలా వెంకట పరదేశినాయుడు, శ్రీను, వెంకటరావు, నమ్మి చిన్నరాజు, పల్లా శ్రీను, రమేష్, చందు, త్రినాథ్, శివ, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కప్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి రెఫరీగా డీవీఎస్‌వై శర్మ



విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరు, అంతర్జాతీయ బ్లూ బ్యాడ్జి అంపైర్ ప్యానల్ హోల్డర్ డాక్టర్ డీవీఎస్‌వై శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి చెన్నైలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ ర్యాంకు ఆటగాళ్ల మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక వరల్డ్ కప్ సీనియర్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి డాక్టర్ శర్మ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్న శర్మ... వరల్డ్ చాంపియన్‌షిప్ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ డి.రామారావు, ఆఫీసు సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు జెకె నాయక్, ఇతర ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

ఎండలు మండిపోతున్నా.. చలివేంద్రాల ఊసెత్తని జీవీఎంసీ

మాధవధార, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి ఆరంభం నుంచే ఎండలు మండిపోతున్నాయని నగరవాసులు నిట్టూరుస్తున్నారు. వాతావరణ నివేదికలు కూడా ఈ వేసవి రికార్డు స్థాయి మంటలే అని హెచ్చరిస్తున్నా, నగర పాలక సంస్థ చలివేంద్రాల ఏర్పాటుపై ప్రకటన కూడా చేయలేదు. బడులకు వెళ్తున్న చిన్నారులు, పరీక్షా కేంద్రాల వద్ద అల్లాడుతున్న పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు దాహార్తితో ఇబ్బంది పడుతున్నారు. అవసరమైన సమయంలో కాకుండా నింపాదిగా టెండర్లు పిలిచి రూ.లక్షలు వ్యయం చేస్తే ఉపయోగమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నందగిరినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :నందగిరినగర్ సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని 44వ వార్డు నందగిరినగర్‌లో నిర్వహించారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది స్థానికులకు వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

డాబాగార్డెన్స్‌లో సమస్యలు కానరావా?

» రాజకీయుల కోసమే పార్కు » ఆచూకీ లేని చేతిపంపులు » మ్యాన్‌హోల్స్‌పై పలకలు ఉండవు » రహదారులు తీరు ఘోరం


రంగాస్ట్రీట్‌లో చేతిపంపు ఉనికి ఇలా...


పార్కులో పడేసిన హైమాస్ట్ విద్యుత్ స్తంభం


ఫుట్‌పాత్‌పై పలకలు వేయని దృశ్యం

డాబాగార్డెన్స్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున గల డాబాగార్డెన్స్ ప్రాంతం తెలియనివారుండరు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోకి వచ్చే డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. సమస్యలు గుర్తించి పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరస్వతీ పార్కు, కృష్ణాగార్డెన్స్, పాత జైల్‌రోడ్డు, సెంటర్‌పాయింట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ప్రతి సోమవారం సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న అధికారులకు తాము పడుతున్న ఇబ్బందులు కనిపించవా? అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

చేతిపంపుల చిరునామా ఎక్కడ?

వార్డులో చేతిపంపులు ఉన్నాయా? అన్న సందేహం కలుగుతుంది. పాదచారులు, వృద్ధులు, విద్యార్థులు దాహార్తి తీర్చుకునేందుకు చేతిపంపులు ఉపయోగకరం. వీటిని పట్టించుకోనే నాథుడే లేరు. కొన్నిచోట్ల చేతి పంపులు కనిపించకుండా బడ్డీలు పెట్టడం, ఆక్రమణల్లో ఉంచేయడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ఫుట్‌పాత్‌లపై పలకలు శూన్యం

ఫుట్‌పాత్‌లపై పలకలు వేయడానికి అధికారులకు తీరిక ఉండడం లేదు. పాత జైల్‌రోడ్డులోని జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఎన్నో కాలువలు, ఫుట్‌పాత్‌లపై పలకలు లేవు. రాత్రివేళ అనేక మంది వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మూగజీవులు పడిపోతే బయటకు తీసేందుకు అపసోపాలు పడుతున్నారు.

రహదారులు ఘోరం

వార్డులోని సెంటర్‌పాయింట్, కృష్ణాగార్డెన్స్ భానుస్ట్రీట్ ప్రాంతాల్లోని రహదారులపై పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తాయి. బాటసారులు అవస్థలు పడుతున్నారు. అనేక మంది ఆటోల్లో వెళ్లినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు.

సరస్వతీ పార్కులోకి ప్రవేశం ఇబ్బందే

సరస్వతీ పార్కుకు రోజూ సందర్శకులు వస్తుంటారు. మూడు వైపులా ద్వారాలు ఉన్నప్పటికీ, ప్రధాన ద్వారంవైపు ఒకవైపు వెళ్లేలా దారిని మూసేశారు. రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టుకునేందుకు ఈ పార్కునే వాడేస్తున్నారు. వీరి కోసం ఏకంగా ద్వారంవైపు ఉన్న గేట్‌ను కర్రలతో కట్టేసి ఉంచేయడం గమనార్హం. పార్కులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపస్తంభాన్ని సైతం చెట్లలోకి నెట్టేశారు. సందర్శకులు పార్కు అందాలు చూసేందుకు కూడా వీలులేకుండాపోతోంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

'భగత్‌సింగ్ స్ఫూర్తితో పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందాం'


భగత్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నేతలు

అక్కయ్యపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భగత్ సింగ్ స్ఫూర్తితో పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందామని సీఐటీయూ పోర్టు యూనియన్ కార్యదర్శి కె.సత్యనారాయణ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించవద్దని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరసన దీక్షలు ఆదివారానికి 174వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విశాఖపట్నం అభివృద్ధికి పోర్టే కారణమన్నారు. వేలాది కోట్ల రూపాయలు రిజర్వ్ ఫండ్స్ ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఉన్న అన్ని సంఘాలను మద్దతుని కూడగడుతామని, ఇతర పబ్లిక్ సెక్టార్, అంఘటిత కార్మిక సంఘాల మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తామన్నారు. పోర్టు ల్యాండ్ లార్డ్ బ్యాంకులో తనఖా పెట్టి అప్పులు తీసుకొచ్చి పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో త్రినాథరావు, సీహెచ్ నాయుడు, వేంకటేశ్వరరావు, భాస్కరరావు, ఉమామహేశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక


జనసేనలో చేరిన నేతలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతమ్మధార, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో పలువురు చేరారు. జీవీఎంసీ 38వ వార్డుకు చెందిన విశాఖ నగర వెండి వర్తక సంఘం అధ్యక్షుడు మారోజు శ్రీనివాస్‌తో పాటు ఇతరులు జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కూటమిలో స్వేచ్ఛ ఉంటుందన్నారు. జనసేనలో చేరేందుకు మరింత మంది ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్‌రెడ్డి, అనుపోజు వెంకటఅరుణ్, సత్యనారాయణ, శ్రీకాంత్, శ్రావణి, గుండు సురేష్‌బాబు, నారా నాగేశ్వరరావు, మర్రివేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వల నిండుగా.. అమ్మకాలు దండిగా



బీచ్ రోడ్డులోని అక్వా స్పోర్ట్ ఎదురుగా సముద్రంలో పలువురు మత్స్యకారులు ఆదివారం ఉదయం చేపలు వేట సాగించారు. చిన్నపాటి పడవ సహాయంతో తీరం సమీపంలో వలలు వేసి చేపలు పట్టారు. ఈ వలకు భారీగా చేపలు చిక్కడంతో మత్స్యకారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చేపలు కొనుగోలు చేయడానికి నగరవాసులు భారీ సంఖ్యలో చేరుకుని గుమిగూడారు. అంతే.. కొద్ది క్షణాల్లో చేపలన్నీ అమ్ముడు కావడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే, శాసనసభలో బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేశారు. రూ.5,54,570లను చెక్కుల రూపంలో అందించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఉషాకిరణ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

సీతంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా పోలీసు స్టేషన్, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ ఎస్ఐలు రౌడీ షీటర్లకు పలు సూచనలు చేశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అనే భావన కేంద్ర సర్వే బృందానికి ఉంటుంది. పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం ఎలా ఉందనే దానిని పరిశీలిస్తుంది. కాబట్టి బీచ్‌లో యంత్రాలతో చెత్త సేకరణ చేసి పరిశుభ్రంగా ఉంచుతున్నాం. పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, బీచ్‌లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతున్నాం.

ప్రశ్న: లిక్విడ్ వేస్ట్ రీసైక్లింగ్ విభాగంలో జీవీఎంసీ పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: స్వచ్ఛసర్వేక్షణ్‌లో లిక్విడ్‌వేస్ట్ (మురుగునీరు పునర్వినియోగం) రీసైక్లింగ్ కీలకం. గత కొన్నేళ్లుగా ఈ అంశంలో కొంత వెనుకబడినప్పటికీ ఇటీవల ఉన్నతాధికారుల ప్రత్యేక చొరవతో బీచ్‌లో కలుస్తున్న మురుగునీటిని ఎస్‌టీపీలకు మళ్లిస్తున్నాం. అలాగే యూజీడీ ద్వారా ఎస్‌టీపీలకు చేరిన మురుగునీటిని శుద్ధిచేసి పరిశ్రమలకు విక్రయిస్తున్నాం. దీనివల్ల జీవీఎంసీకి ఏటా రూ.30 కోట్లు ఆదాయం సమకూరుతోంది.

పదవుల కోలాహలం

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. మేయర్‌గా పీలా శ్రీనివాస్‌ను కాదంటే తమకు అవకాశం ఇవ్వాలని యాదవ సామాజికవర్గానికి చెందిన ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత 26 వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి కూటమి నేతల వద్ద ప్రతిపాదించినట్టు తెలిసింది. ఒక డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించడం ఖాయమని, 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మికి ఇవ్వాలని ఆ పార్టీ నేతలు కోరినప్పటికీ, మేయర్‌గా పీలా శ్రీనివాస్‌కు అవకాశం ఇస్తే అదే సామాజికవర్గానికి బీశెట్టి వసంతలక్ష్మికి అవకాశం దక్కకపోవచ్చునని అంచనావేస్తున్నారు. అలాంటపుడు కాపు సామాజికవర్గానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ కోరుతున్నట్టు సమాచారం.

మరో డిప్యూటీ మేయర్ పదవిని కాపు సామాజికవర్గానికి చెందిన 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకి దక్కడం ఖాయమని ప్రచారం జరుగుతున్నప్పటికీ, జనసేన నుంచి కాపు సామాజికవర్గానికి అవకాశం ఇస్తున్నందున యాదవ సామాజికవర్గానికే ఇవ్వాల్సి ఉంటుందని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఒత్తిడి చేస్తున్నట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. టీడీపీ ఫ్లోర్ లీడర్ పదవి కోసం కూడా పలువురు పోటీ పడుతున్నారు. ఇదిలావుంటే ఇటీవల వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లంతా వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత లేకపోవడం వల్లే పార్టీ మారిపోవాల్సి వచ్చిందని, ఇక్కడైనా ప్రాధాన్యం దక్కాలంటే ఒకరికైనా పదవి దక్కేలా ఏకాభిప్రాయంతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆశావహులంతా ఎవరికివారు నేతలపై ఒత్తిడి చేస్తుండడంతో వారంతా ఎవరికీ హామీ ఇవ్వలేక తల పట్టుకుంటున్నారు. ముందు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గితే, తర్వాత పదవుల పంపకంపై దృష్టిపెడదామంటూ తప్పించుకుంటున్నారు.

నేడే ఐపీఎల్ సమరం

... 5వ పేజీ తరువాయి

స్టేడియంలోకి ప్రవేశించడానికి 20 గేట్లు ఏర్పాటు చేశారు. గేట్ నంబరు 1 నుంచి క్రికెటర్లు, మ్యాచ్ అఫీషియల్స్, ఏసీఏ, బీసీసీఐ, ప్రభుత్వ అధికారులు, ఈస్ట్, వెస్ట్ పెవిలియన్, 1 నుంచి 18 కార్పొరేట్ బాక్సులకు ప్రవేశం కల్పించారు. 2వ గేటు నుంచి సౌత్‌వెస్ట్ అప్పర్, 19 నుంచి 26 కార్పొరేట్ బాక్సులకు వెళ్లేవారికి ప్రవేశం ఉంటుంది. 3వ గేటు సౌత్‌వెస్ట్ అప్పర్, 4- బి స్టాండ్, 5-ఎ స్టాండ్, 6-సి స్టాండ్, 7-డి, డి1 స్టాండ్‌లు, 8-ఇ, ఇ1 స్టాండ్లు, 9-ఎఫ్, ఎఫ్1 స్టాండ్లు, 10-జి స్టాండు ద్వారా ప్రవేశం కల్పిస్తారు. 11- కామెంటేటర్స్, బీసీఆర్ రూం, మీడియా, 12-హెచ్ అండ్ జె స్టాండ్స్, 13-ఐ స్టాండ్,14-కె స్టాండ్, 15- ఎం స్టాండ్, 16ఎ-ఎం1 స్టాండ్, 16-ఎల్ స్టాండ్, 17-ఎన్ స్టాండు, 18-ఓ స్టాండ్, 19-సౌత్‌ఈస్ట్ లోవర్, 20- సౌత్‌ఈస్ట్ అప్పర్ 27 నుంచి 34 వరకు ఉన్న కార్పొరేట్ బాక్సులకు ప్రవేశం కల్పిస్తారు. ప్రేక్షకులు కెమెరాలు, మ్యాచ్‌బాక్సులు, లైటర్లు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, మండే స్వభావంగల వస్తువులు, పొగాకు ఉత్పత్తులు, టిఫిన్లు, పదునుగా ఉన్న వస్తువులు, తినుబండారాలు, గొడుగులు, క్రేకర్స్, జంతువులు, రేడియో, ఆల్కహాల్, కర్రలు, లేజర్‌లైట్లు, బెలూన్లు, గ్లాస్‌బాటిళ్లు, పెర్‌ఫ్యూమ్స్, స్ప్రే బాటిళ్లు, సిరంజిలు, విజిల్స్, హారన్స్, స్పోర్టింగ్ బాల్స్, రోలర్ స్కేటర్లు, ప్రమోషనల్ ప్రొడక్ట్స్, ల్యాప్‌ట్యాప్‌లు, పెన్నులు, పెన్సిళ్లు తీసుకురాకూడదు.

ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో సోమవారం జరగనున్న ఐపీఎల్ టి-20 క్రికెట్ మ్యాచ్‌కు ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులు నడపనుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాభిమానులను తరలించేందుకు, మ్యాచ్ ముగిసిన తరువాత వారిని ఆయా ప్రాంతాలకు చేర్చేందుకు బస్సులు అందుబాటులో ఉంటాయి. రాత్రి 7.30 నుంచి 11 గంటల వరకు మ్యాచ్ జరుగుతుందని, దీంతో సాయంత్రం 5.30 నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 11 నుంచి 1 గంట వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. గాజువాక, పాతపోస్టాఫీస్, సింహాచలం, కూర్మన్నపాలెం, తగరపువలస ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.


తీరంలో భారీ యంత్రాలతో తొలగిస్తున్న కట్టడాలు

జోరుగా అక్రమ కట్టడాల కూల్చివేత

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరంలో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ సీఆర్‌జడ్ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాల కూల్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి. సముద్ర కెరటాల సమీపంలో సుమారు 11 అడుగుల భూగర్భంలో అతిబలంగా నిర్మించిన కాంక్రీట్ స్ట్రక్చర్‌ను తొలగించడానికి భారీ యంత్రాలను వినియోగిస్తున్నారు. అలాగే హోండాయ్ ఇఎక్స్ 200, హెచ్‌పీ 215 సామర్థ్యం కలిగిన అతిపెద్ద బ్రేకర్స్‌ను, భారీ బకెట్ కలిగిన జేసీబీని వినియోగించి కట్టడాలు తొలగిస్తున్నారు. కట్టడాల తొలగింపులో చాలావరకు యంత్రాలు మరమ్మతుకు గురవుతున్నాయి. సుమారు 588 రన్నింగ్ మీటర్ల పొడవున రెండు పొడవాటి వాల్స్‌ను స్ట్రాంగెస్ట్ కాంక్రీట్ వాల్స్‌ను అక్రమంగా నిర్మించారు. ఇక్కడ 7 స్టార్ హోటల్ కోసం అవ్యాన్ సంస్థ ఈ నిర్మాణాలు చేపట్టిందని కొందరు భావిస్తుండగా, మరికొందరు ప్రైవేటు టూరిస్ట్ క్రూయిజ్ టెర్మినల్ కోసం నిర్మాణాలు జరిగాయని చెబుతున్నారు. ఏదిఏమైనా కోర్టు ఆదేశాల మేరకు అధికారులు కొన్ని రోజులుగా అక్రమ కట్టడాలను తొలగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, డీసీపీలు, ఏఈ సురేశ్ పనులను సందర్శించారు. కాగా ఆదివారం ఉదయం సుమారు 9.45 గంటల ప్రాంతంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంబంధిత ప్రదేశాన్ని పరిశీలించారు. సుమారు 15 నిమిషాల పాటు ఇక్కడ ఉన్నారు.అనంతరం భీమిలి బ్యాంక్ రోడ్‌లో ఉన్న ఒక పురాతన గెస్ట్ హౌస్‌కు వెళ్లినట్టు తెలిసింది.

వివాహిత ఆత్మహత్య కేసులో దంపతుల అరెస్టు

భీమునిపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గొల్లలపాలెంలో వివాహిత పీతల రాజేశ్వరి ఆత్మహత్యకు కారణమైన గుడ్డాల ఉజ్వల, ఆమె భర్త సురేశ్‌ను ఆదివారం అరెస్టు చేసినట్టు భీమిలి సీఐ తిరుమలరావు తెలిపారు. ఈనెల 21న ఉజ్వల మానసిక వేధింపులు తాళలేక రాజేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతురాలి భర్త వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఉజ్వల, ఆమె భర్త సురేశ్‌ను అరెస్టు చేశారు.

స్క్రాప్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

» సుమారు రూ. 30 లక్షల ఆస్తి నష్టం
» కాపులుప్పాడ డంపింగ్ యార్డు సమీపంలో ఘటన


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొమ్మాది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లే రోడ్డు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిని ఆనుకుని ఓ వ్యక్తి నగరంలోని చిన్న చిన్న స్క్రాప్ దుకాణాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను కొనుగోలు చేసి, వాటిని మిషనరీ ద్వారా పొడి చేసి తిరిగి హోల్‌సేల్‌గా ఎగుమతి చేస్తుంటాడు. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో దుకాణంలో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. వెంటనే స్థానికులు చిట్టివలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు రెండు శకటాలతో వచ్చి మంటలు అదుపు చేశారు. దుకాణం మొత్తం మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. ఈ ఘటనలో రూ. 30 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు. ప్రమాదం సమయంలో భారీగా పొగ వ్యాపించడంతో చుట్టు పక్కల నివాసితులు, జాతీయ రహదారిపై ప్రయాణించేవారు భయాందోళనకు గురయ్యారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందన్నది తెలియలేదు. పీఎంపాలెం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చలివేంద్రం ప్రారంభం

మహారాణిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 29వ వార్డు జిల్లా పరిషత్ జంక్షన్ శ్రీకృష్ణ చైతన్య మఠం దగ్గర జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ 23 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, ఆయన్ను పలువురు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొగ్గు శ్యామ్, గోపి, కల్యాణి, సదాశివరావు, నమ్మి సూర్యనారాయణ, వియ్యపు చిన్నారావు, రమణ, దుక్క ప్రసాద్, కిలని అప్పారావు, గుమ్మడి శ్రీను, పీతల చిన్న, కోన బాబూరావు పాల్గొన్నారు.

150 మంది రక్తదానం

డాబాగార్డెన్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆలిండియా ఎక్స్ సర్వీస్‌మెన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కాంతారావు, ప్రవీణ్‌శర్మ, ఎస్.సురేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో ఫెడరేషన్ పదో వార్షికోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ ఫెడరేషన్ సభ్యులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం 150 మంది సభ్యులు రక్తదానం చేశారు.



విడుదల తేదీ చూపిస్తున్న హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక

ప్రేమ, వినోదం కలిపితే 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'

మహారాణిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ, వినోదం కలిపితే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రమని హీరో ప్రదీప్ మాచిరాజు అన్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తీశామన్నారు. తొలి పాట విడుదల చేశామని, ఈ పాటను ఉదిత్‌నారాయణ ఆలపించగా శ్రీధర్ లిరిక్స్ అందించారన్నారు. వచ్చే నెల 11న సినిమాను విడుదల చేస్తామన్నారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం నేరమేనని, అటువంటి వాటిని ఎవరూ ప్రమోట్ చేయకూడదన్నారు. విలేకరుల సమావేశంలో హీరోయిన్ దీపిక కూడా పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఐవీఎల్ శాస్త్రి

డాబాగార్డెన్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సంగీత జనకులం సంస్థ వ్యవస్థాపకుడు ఐవీఎల్ శాస్త్రి సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఐవీఎల్ శాస్త్రి 98వ జయంతి పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సంగీత విద్వాంసులు ఆకొండి వెంకటరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో సంగీత జనకులం అనే శాస్త్రీయ సంగీత సేవా సంస్థను స్థాపించి, వేలాది మందికి ఉచితంగా శాస్త్రీయ సంగీతం నేర్పించిన ఘనత ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని)

క్రీడా రాజధానిగా విశాఖ

- 60 రోజుల్లోనే పీఎం పాలెం స్టేడియంను అద్భుతంగా తీర్చిదిద్దాం
- త్వరలో వుమెన్ వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యం
- డిసెంబరులో ఇండియా-దక్షిణాఫ్రికా మ్యాచ్
- నేటి ఐపీఎల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని)

మధురవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రకటించారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియం అభివృద్ధి పనులు చేపట్టాలని డిసెంబరు 20న నిర్ణయించి, జనవరి 20న పనులు ప్రారంభించామన్నారు. కేవలం 60 రోజుల్లో స్టేడియం రూపురేఖలు పూర్తిగా మార్చివేశామన్నారు. సుమారు రూ.9.5 కోట్ల వ్యయంతో హాలోజిన్ లైట్ల స్థానంలో ఎల్ఈడీ లైట్లు అమర్చామన్నారు. గ్యాలరీలో కుర్చీలు, టాయిలెట్లు, కార్పొరేట్ బాక్సులు, లిఫ్టులు, అదనపు హంగులు సమకూర్చామన్నారు. సెప్టెంబరులో ప్రారంభంకానున్న వుమెన్ వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ఒక మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందన్నారు. ఇండియా టూర్‌లో భాగంగా ఈ స్టేడియంలో సౌతాఫ్రికా డిసెంబరులో ఒక మ్యాచ్ ఆడే అవకాశం వుందన్నారు. రానున్న రోజుల్లో ఏసీఏ-వీడీసీఏ స్టేడియం మరిన్ని అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు వేదిక కాబోతుందన్నారు. ఏపీఎల్ క్రికెట్ ఫార్మాట్‌ను పూర్తిగా మారుస్తామన్నారు. పాఠశాలల చిన్నారులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పిస్తామన్నారు. సోమవారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిన్ని తెలిపారు. ఈ సీజన్‌లో విశాఖకు రెండు ఐపీఎల్ మ్యాచ్‌లు కేటాయించిన బీసీసీఐ, మ్యాచ్‌లు ఆడుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్లకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ బాబు, సీఈఓ గిరీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి బోయమాంబ జాతర

అగనంపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత పినమడక, పూడివానిపాలెం, కర్రివానిపాలెం, కొత్తూరు గ్రామాల ప్రజల ఆరాధ్యదేవత బోయమాంబ జాతర సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేస్తామన్నారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, మునక్కాడలు (కిలో) 28, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

ఠాణాలోని వాహనాలకే రక్షణ కరువాయె..

- వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలో భద్రపరుస్తున్న సిబ్బంది
- ఇటీవల కొన్ని వాహనాలు చోరీకి గురైనట్టు గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు
- క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వాహనాలు

గాజువాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో కీలకమైన గాజువాక పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు రక్షణ కరువైంది. ఇటీవల రెండు, మూడు వాహనాలు చోరీకి గురయ్యాయి. అంతేకాక వాహనాలకు సంబంధించిన విడి భాగాలు సైతం మాయమవుతున్నాయి. కాగా స్టేషన్‌లో వాహనాలు చోరీకి గురైన విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నెల రోజుల క్రితం పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, ఇందుకు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలో భద్రపరిచారు. అలాగే 20 రోజుల క్రితం రోడ్డుపై నడిచి వెళ్తున్న పాదచారిని ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో గాయపడ్డారు. దీంతో ప్రమాదానికి కారణమైన ఆ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ రెండు వాహనాలను తమకు తిరిగి ఇవ్వాలని వాహన యజమానులు ట్రాఫిక్ పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. అయితే ఆయా వాహనాలపై కేసులు నమోదవ్వడంతో కోర్టు అనుమతితో తీసుకోవాలే తప్పా నేరుగా ఇవ్వడం జరగదని పోలీసులు వారికి చెప్పారు. కాగా పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన వాహనాలు మాయమైనట్టు ట్రాఫిక్ పోలీసులు గుర్తించి క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు మృతికి కారణమైన ద్విచక్ర వాహనం వేరొకరిది కాగా, పాదచారిని ఢీకొన్న వాహనం సంబంధిత వ్యక్తిదే. వీటి కోసం పదేపదే వారు స్టేషన్ చుట్టూ తిరగడం.. ఈ క్రమంలో సదరు వాహనాలు మాయం కావడంతో పోలీసుల్లో అనుమానం రేకెత్తింది. వందలాది వాహనాలు అక్కడ ఉండగా ఈ రెండు వాహనాలు మాత్రమే మాయమవ్వడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

మాయమవుతున్న వాహనాల విడి భాగాలు

గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో శాంతిభద్రతలు, క్రైమ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉండడంతో వివిధ కేసుల్లో స్వాధీనం వాహనాలను స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలోనే భద్రపరుస్తున్నారు. సుమారు పాతికేళ్లుగా వాహనాలను ఇక్కడ భద్రపరుస్తుండడంతో స్టేషన్ ఆవరణలో ఎటుచూసినా అవే కనిపిస్తాయి. వాటిని పరిశీలిస్తే అధిక శాతం వాహనాలకు సంబంధించి టైర్లు, బ్యాటరీలు, ఇతర విడి భాగాలు కనిపించడం లేదు. గతంలోనూ విడి భాగాలు మాయం కావడంతో పోలీసులు ఇక్కడ గస్తీ చేపట్టారు.

భద్రతా లోపం వల్లే..

ఇక్కడి పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో డీసీపీ, ఏసీపీ కార్యాలయాలతో పాటు మూడు విభాగాల స్టేషన్లు ఉన్నాయి. అయితే స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు లేకపోవటం, ప్రవేశ ద్వారం వద్ద ఎటువంటి తనిఖీలు చేపట్టకపోవడం, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్లే ఇక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోపక్క రాత్రి వేళల్లో ఇక్కడ విద్యుత్ లైట్లు లేకపోవడంతో అంతా చీకటిమయంగా ఉంటుంది. అందువల్ల రాత్రి సమయాల్లోనే చోరీలు జరుగు తున్నాయన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

- కేంద్రం ప్యాకేజీ ఇచ్చింది కార్మికులను తొలగించడానికా?
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కూర్మన్నపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి రక్షణ యాత్ర పేరిట ఆదివారం కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెంలోని రిలే నిరాహార దీక్షల శిబిరం వరకు చేపట్టిన పాదయాత్ర విజయవంతమైంది. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇచ్చింది కార్మికులను తొలగించడానికా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో ఇంత దారుణమైన కార్మికుల తొలగింపును మునుపెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు కాంట్రాక్టు కార్మికులను ఏ ఒక్కరినీ తొలగించరాదని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల మద్దతు ఉందన్నారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందే తప్పా కార్మికులను తొలగిస్తే రాదని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల తొలగింపును ఆపకపోతే రానున్న రోజుల్లో జరిగే ఉధృత పోరాటాలకు, పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తొలగించిన కార్మికులను వెంటనే విధులోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించరాదని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, సకాలంతో వేతనాలు ఇవ్వడంతో పాటు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రానికి స్టీల్‌ప్లాంటును నడిపే ఉద్దేశం లేదన్నారు. అదానీకి కట్టబెట్టే యోచనలో ఉందని, ప్రభుత్వాల కుట్రను ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, కేఎస్ఎన్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావుల, జగ్గు నాయుడు, జె.రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, యు.రామస్వామి, కేఎం శ్రీనివాస్, నమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్సీ సోము వీర్రాజును సత్కరిస్తున్న దృశ్యం, పార్టీలో చేరిన నేతలు

పెదవాల్తేరు మార్చి 23 : బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం బీజేపీ విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామరాజు అధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో వైసీపీ నుంచి సుమారు 100 మంది యువనాయకులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు మాట్లాడుతూ నరేంద్ర మోదీ భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు చేపట్టారన్నారు. అంతర్జాతీయంగా పేరు భారతదేశ ప్రతిష్ఠ పెరిగిందని, కులమతాలకు అతీతంగా సాగుతున్న మోదీ పరిపాలనకు ఆకర్షితులై అనేక మంది బీజేపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎన్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్ విజయేంద్రరెడ్డి, బీజేపీ విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సుహాసినీఆనంద్, టి. సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతనుంచి..

మల్కాపురం: వైసీపీ అనుబంధ సంస్థ వైఎస్ఆర్‌టీయూసీ వి శాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ తన అనుచరలతో బీజేపీలో ఆదివారం చేరారు. ఇటీవల బీజేపీలో చేరిన ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతం నుంచి అనేక మంది నాయకులు నగరంలోకి వెళ్లి ఎమ్మెల్సీ సోమువీర్రాజు సమక్షంలో ఆపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి.. అనంతరం కలిదండి బద్రీనాథ్ మాట్లాడారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న మళ్ల విజయప్రసాద్ వ్యవహారశైలి నచ్చకపోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై బీజేపీలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న ఏడువార్డులో బీజేపీ బలోపేతం కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందిస్తామన్నారు.

రోడ్లపై చెత్త నియంత్రణకు వినూత్న చర్యలు



రోడ్ల ఇరువైపులా చెత్త వేయకుండా రంగురంగుల ముగ్గులతో అలంకరణ

సింధియా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40, 63 వార్డుల పరిధిలోని చింతలలోవ, ఎకేసీ కాలనీ ప్రాంత ప్రధాన రోడ్లకు ఇరువైపులా వ్యాపారులు చెత్త, మాంసం వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు వేస్తుండడంతో ఆయా పరిసరాలు దుర్గంధభరితం మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వార్డు శానిటరీ ఇన్స్‌పెక్టర్ రమేశ్ ఆదివారం సిబ్బందితో కలసి వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రధాన బ్లాక్ స్పాట్స్‌లో చెత్త, వ్యర్థాలు నివారించేందుకు మహిళా శానిటరీ సిబ్బందితో ఆ ప్రాంతమంతా శుభ్రపరిచి కల్లాపు జల్లి ముగ్గలతో అలంకరించారు. ఇకపై ఆప్రదేశంలో చెత్తతో కూడిన వ్యర్థాలు వేసినచో రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పారిశుధ్య సిబ్బందికి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు జోన్-8లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వేపగుంట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాయపూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే అనుసంధాన రోడ్డు పనులు, ఉత్తరాపల్లి వద్ద తాటిపుడి ప్రధాన పైపులైన్ 900 బీడబ్ల్యూఎస్ రిఎలైన్‌మెంట్ పనులతో వేపగుంట జోన్- 8 పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-8లో ఉన్న 93, 94, ,95, 97 98వ వార్డు పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపేస్తామ్నారు. తాటిపుడి ప్రధాన పైపులైన్‌లో ఉన్న మంచినీటి సరఫరా బల్క్ (రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్) వినియోగదారులకు నీటి సరఫరాకు కొంతమేర అంతరాయం జరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. ఆయా ప్రాంతవాసులు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలం కూటమి నేత కబ్జా

- మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



చినముషిడివాడలో ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలో తప్పుడు పత్రాలతో రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కూటమి నేత కబ్జాకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆరోపించారు. చినముషిడివాడలో సర్వే నంబర్ 113లో గల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్నట్టు స్థానిక వైసీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికితీసుకువచ్చారు. ఈక్రమంలో ఆదివారం అదీప్‌రాజ్ ఈ స్థలాన్ని పరిశీలించారు. ఇదే స్థలంలో గతంలో ఆక్రమ నిర్మాణం జరిగితే రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారని, ఇప్పుడు అదే స్థలం లో భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. 97వ వార్డు వైసీపీ అధ్యక్షుడు మెంటి మహేశ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు న్యాయం చేయాలి'

వేపగుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు పరిధి కృష్ణరాయపురంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీల వర్గీకరణలో రెల్లి కులస్థులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భూపతి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెల్లి కులస్థులకు ఒకశాతం ఇవ్వటం సమంజసంగా లేదని, దీనిపై పునః సమీక్ష చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగళగిరి శ్రీను, డి.సత్యం భూపతి, తారకం తదితర కులసంఘాలు నేతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం ఉడా లే అవుట్ ప్రాంతంలో మ్యాక్స్ విజన్; హెచ్ఐజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని ప్రారంభించారు. ఈటి సత్యనారాయణ, విజయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రాన్స్‌జెండర్ హత్య కేసు నిందితుడిని కఠినంగా శిక్షించాలి'



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ట్రాన్స్‌జెండర్స్

పెందుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపు హత్యకేసులో నిందితుడు దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీని ఉరి తీయాలని ట్రాన్స్‌జెండర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్థానిక జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దీపు దారుణ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నిందితుడు బన్నీ శిక్ష అమలులో జాప్యం నెలకుంటే ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. హిజ్రాలపై జరుగుతున్న హత్యలు, దాడులను నియంత్రించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వాలు తమ హక్కులు దక్కేలా వ్యవహరించాలన్నారు.



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీఎస్ శంకరరావు, తదితరులు

సీతారాముల కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

ఆటోనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలోని రామాలయం వద్ద శ్రీసీతారాముల కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఆరున శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, కల్యాణం, అన్న సమారాధన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి ఎస్.శ్రీనివాస్, అర్చకులు కె.సోమేశ్వరరావు, ఎం.శివ, కృష్ణంరాజు, మూర్తి, రవి, పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి సౌండ్ సిస్టమ్, స్పీకర్ల వితరణ



ఆలయ కమిటీ ప్రతినిధులకు సౌండ్ సిస్టమ్, స్పీకర్లను అందజేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్ రామాలయానికి ఆదివారం టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ సుమారు రూ.35 వేల విలువైన సౌండ్ సిస్టమ్, స్పీకర్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో ప్రజలంతా పాల్గొనాలన్నారు. ఉదయాన్నే సుప్రభాత పాటలను ప్రజలంతా వినేలా ఆలయ కమిటీ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీను, నాగార్జున, వెంకటసుబ్బయ్య, గణపతి, వెంకటేశ్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు కోసం శ్రమించిన వారికి మంచి గుర్తింపు'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం కోసం కృషి చేసిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో 34 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న బుద్దరాజు సుబ్బరాజును ఆదివారం యూనియన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ ఉద్యోగులకు సుబ్బరాజు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీఎస్ రాజు, పీవీ రమణమూర్తి, అశోక్‌రాజు, శ్రీనివాసరావు ప్రకాశ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

పెదగంట్యాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కథలు చదివించడం, వారితో కథలు రాయించడం చేశారు. సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విద్యార్థులు కథలు రాశారు. వీటిలో మంచి కథలను ఎంపిక చేసి చదివి విద్యార్థులకు వినిపించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎన్‌సీసీ వలంటీర్ దివ్యశ్రీకి గవర్నర్ అభినందన



దివ్యశ్రీకి సర్టిఫికేట్ అందజేస్తున్న గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్

మల్కాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్ పి. దివ్యశ్రీని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అమరావతిలో తన నివాస రాజభవన్‌లో శనివారం అభి నందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవకు యువత అంకితం కావాలని పేర్కొన్నారు. ఆదివారం నగరానికి విచ్చేసిన దివ్యశ్రీని సెయింట్ ఆన్స్ కళాశాల యజమాన్యం ఘనంగా సత్కరించారు. అనంతరం దివ్య శ్రీ అందించిన సేవలను విశాఖ జిల్లా నోడల్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి, ఇతర ప్రోగ్రాం అధికారులు కొనియాడారు.

రంజాన్ మాస దీక్షలతో భక్తి భావం



ముస్లింల ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాస ఉపవాస దీక్షలు క్రమశిక్షణ, భక్తిభావం అలవడడానికి దోహదపడుతుందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని గణబాబు నివాసంలో పశ్చిమ నియోజకవర్గ ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ దేశప్రజలు కులమతాల బేధం లేకుండా సోదర భావంతో మెలుగుతూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

భగత్‌సింగ్ ఆదర్శనీయులు

సింధియా, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ భగత్ సింగ్ జంక్షన్‌లో సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు నూనెల సూరిబాబు, కనకరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

52 మంది రక్తదానం

పెందుర్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో సాయిరామ్ మెడికల్స్ సౌజన్యంతో స్థానిక జంక్షన్‌లో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 52 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పలువురు అవయదానానికిఅంగీకరిస్తూ పత్రాలను నమోదు చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను రక్తదాతలకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. సభ్యులు గణేశ్. భాను. వినయ్, తేజ నారాయణ, గోపీ, సునీత పాల్గొన్నారు.

గాజువాకలో పెన్షనర్ల జాతీయ సమావేశం రేపు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి పదవీ విరమణ చేసిన కార్మికులకు కనీస పెన్షన్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తు ఈ నెల 25న గాజువాకలో జాతీయ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పోరాట కమిటీ విశాఖ ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, ఏవీఎన్ఎం అప్పారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గాజువాకలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. పెన్షనర్లందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళకు ఇల్లు నిర్మించి ఇచ్చిన సత్యసాయి సమితి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో నిరుపేద అయిన ఓ వితంతు మహిళకు ఇల్లు నిర్మించి అందజేశారు. నడుపూరులోని డెయిరీ కాలనీకి చెందిన శారదాంబకు సమితి ఆధ్వర్యంలో ఇల్లు నిర్మించి ఆదివారం తాళాలు అందజేశారు. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నామని, భవిష్యత్తులో అందరి సహకారంతో సేవలను విస్తరిస్తామని కన్వీనర్ జి.రామకృష్ణ తెలిపారు.